అక్షర దర్బార్
voice of the people
తెలుగు దినపత్రిక

## ఆన్ లైన్ లో మొక్కులు
# చెల్లించిన ముఖ్యమంత్రి

- మనుమడి నిలువెత్తు బంగారం సమర్పించిన రేవంత్ రెడ్డి
- పలువురు మంత్రులు కూడా..



ఆన్ లైన్ సేవలను ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు

**అక్షర దర్బార్, హైదరాబాద్, ఫిబ్రవరి 9 :** మేడారం సమ్మక్క–సారమ్మకు ఆన్ లైన్ లో నిలువెత్తు బంగారం సమర్పించే కార్యక్రమాన్ని శుక్రవారం సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన తన మనవడు రియాన్ష్ నిలువెత్తు బంగారం(బెల్లం)ను ఆన్ లైన్ ద్వారా వనదేవతలకు సమర్పించారు. అదేవిధంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తన మనవరాలి నిలువెత్తు బంగారం ఆన్‌లైన్ ద్వారా సమర్పించారు. మేడారం జాతరకు వెళ్లలేని భక్తులు తల్లులకు మొక్కులు సమర్పించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆన్ లైన్ పోర్టల్ ను సద్వినియోగం చేసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విన్నవించారు. కార్యక్రమంలో మంత్రులు కొండా సురేఖ, సీతక్క, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, దామోదర రాజనర్సింహ, ఎమ్మెల్యేలు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, దేవాదాయ శాఖ కమిషనర్ అనిల్ కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## మేడారంలో భక్తులకు
# అన్ని వసతులు..

### ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి సీతక్క

**అక్షర దర్బార్, ములుగు, ఫిబ్రవరి 9 :** మేడారం జాతరలో భక్తులకు అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి సీతక్క అన్నారు. జాతర ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి అధికారులకు పలు సూచనలు చేశారు. వీఐపీ, వీవీఐపీల దర్శనం వల్ల సామాన్య భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. మేడారం మహా జాతరకు సీఎం రేవంత్ రెడ్డి వస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# పీవీ మన లీవీ..

- మోడీ చొరవతోనే భారత రత్న
- పీవీ సేవల్ని విస్మరించిన కాంగ్రెస్
- ఆయనకు అత్యున్నత పురస్కారం కట్టబెట్టిన బీజేపీ ప్రభుత్వం
- పూర్తి పారదర్శకంగా పని చేస్తున్న ఎన్డీయే సర్కార్
- బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్
- లక్నేపల్లి పీవీ స్మారక మందిరంలో ఘన నివాళి..



పీవీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న గంట రవికుమార్

**అక్షర దర్బార్, హన్మకొండ, ఫిబ్రవరి 9 :** దివంగత మాజీ ప్రధాని, రాజనీతిజ్ఞుడు, బహుముఖ ప్రజ్ఞాశాలి పీవీ నరసింహారావును కాంగ్రెస్ పార్టీ విస్మరించినా, ఆయన సేవల్ని గుర్తించి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దేశ అత్యున్నత పురస్కారం భారతరత్న అవార్డు ప్రకటించి సమున్నతన స్థానం కల్పించిందని వరంగల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు గంట రవికుమార్ అన్నారు. పీవీకి భారత రత్న ప్రకటించిన సందర్భంగా శుక్రవారం పీవీ నరసింహారావు జన్మస్థలం మైన లక్నేపల్లి గ్రామంలో రవికుమార్ ఆధ్వర్యంలో పీవీ విగ్రహానికి పూలమాల వేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ.. పీవీ భారత రత్నకు ఎంపికవడం దేశ ప్రజలందరికీ గర్వకారణమని అన్నారు. తెలంగాణ ముద్దు బిడ్డ.. దేశం క్లిష్ట పరిస్థితిలో ఉన్నప్పుడు ప్రధానిగా బాధ్యతలు చేపట్టి అభివృద్ధి దిశగా నడిపించిన మహనీయుడు పీవీ అని కొనియాడారు. కానీ కాంగ్రెస్ పార్టీ ఏనాడూ అయన సేవల్ని గుర్తించలేదని విమర్శించారు. ఆయన మరణాంతరం కనీసం ఢిల్లీ లో స్మృతి వనం కూడా నిర్మించ లేదని మండిపడ్డారు. కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ వడ్డపల్లి నరసింహ రాములు, ప్రధాన కార్యదర్శి రేసు శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షుడు కంభంపాటి పుల్లారావు, నర్సంపేట నియోజకవర్గ యువ నాయకుడు రాణా ప్రతాపరెడ్డి, దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు నల్లబెల్లి సుదర్శన్, శక్తి కేంద్ర ఇన్చార్జీ బుసాని సుదర్శన్, రూరల్ మండలం ప్రధాన కార్యదర్శి ముత్తినేని వెంకటేశ్వర్లు, కౌన్సిలర్లు గోల్యానాయక్, వీరన్న, జుర్రు రాజు, నాయకులు పాల్గొన్నారు.

### ఊరూరా సంబురాలు

కేంద్ర ప్రభుత్వం శుక్రవారం భారతరత్న పురస్కారాలను ప్రకటించింది. మాజీ ప్రధానులు పీవీ నరసింహారావు, చౌదరీ చరణ్సింగ్, వ్యవసాయ శాస్త్రవేత్త ఎంఎస్స్వామినాథన్ను అత్యున్నత పౌర పురస్కారంతో గౌరవించింది. ఈ మేరకు ప్రధాని మోడీ ఎక్స్వేదికగా వెల్లడించారు. ఇప్పటికే బిహార్మాజీ ముఖ్యమంత్రి కర్పూరీ ఠాకూర్తోపాటు బీజేపీ కురువృద్ధుడు అద్వానీకి భారతరత్న ప్రకటించారు. కాగా, పీవీ నరసింహారావుకు కేంద్ర ప్రభుత్వం భారతరత్న ప్రకటించడంపై ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ప్రజలు సంబురాలు జరుపుకున్నారు. ఆయన స్వగ్రామైన హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని వంగర గ్రామంతో పాటు పీవీ జన్మించిన వరంగల్ జిల్లా నర్సంపేట మండలంలోని లక్నేపల్లి గ్రామంలోనూ ప్రజలు టపాసులు కాల్చి స్వీట్లు పంచారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్

# తెలంగాణే మా శ్వాస..

### ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్

**అక్షర దర్బార్, హనుమకొండ, ఫిబ్రవరి 9 :** తెలంగాణే మా శ్వాస అని, ఎన్నిసార్లు కింద పడినా మళ్లీ లేచి నిలబడే పార్టీ, ఉద్యమం నుంచి పుట్టిన పార్టీ బీఆర్ఎస్ పార్టీ అని ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ అన్నారు. హన్మకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం వరంగల్ పశ్చిమ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం జరిగింది. బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ హాజరై మాట్లాడారు. ఒక పోరాటాన్ని సొంతం చేసుకున్న కండువా గులాబీ కండువా అని, జై తెలంగాణ నినాదమే మా శ్వాస అని ప్రకటించిన పార్టీ బీఆర్ఎస్ పార్టీ అని అన్నారు. కాంగ్రెస్ పార్టీ వాగ్దానాలకు భంగం కలిగించే పార్టీ అని, అసెంబ్లీ ముందు ఉన్న కంచె కన్నా ఎక్కువ కంచెను ఏర్పాటు చేశారని విమర్శించారు. తెలంగాణ ఉద్యమ చరిత్రలో ప్రస్తుత ముఖ్యమంత్రి లేరని పేర్కొన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అన్నారు మంచిదే కానీ దానివల్ల ఆటో నడుపుకునే వాళ్ల జీవితాలు రోడ్డు మీద పడ్డాయని, వారి బాగు కోసం ఏమైనా చర్యలు తీసుకున్నారా అని ప్రశ్నించారు. దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చేదాకా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని పిలుపునిచ్చారు.

## కామాంధుడిని
# పార్టీలో చేర్చుకోవద్దు

### గాంధీ భవన్ ని ముట్టడించిన మహిళా కాంగ్రెస్ కార్యకర్తలు



గాంధీ భవన్ ముందు ఆందోళన చేస్తున్న మహిళా కార్యకర్తలు

**అక్షర దర్బార్, హనుమకొండ, ఫిబ్రవరి 9 :** ఘన్ పూర్ నియోజకవర్గంలో తాటికొండ రాజయ్య ఎమ్మెల్యేగా ఉన్న రోజుల్లో మహిళ కార్యకర్తలకు మానాభిమానాలపై రక్షణ లేకుండా పోయిందని, అలాంటి కామందుడిని కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించవద్దని స్టేషన్ ఘన్ పూర్ నియోజకవర్గం మహిళా నాయకులు, కార్యకర్తలు హైదరాబాదులోని గాంధీ భవన్‌ను ముట్టడించారు. అనంతరం టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్ ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాటికొండ రాజయ్య వంటి కామాందుడిని కాంగ్రెస్ పార్టీలోకి తీసుకుంటే మహిళా కార్యకర్తలకు రక్షణ ఉండదని వారు ఆందోళన వ్యక్తం చేశారు.